# మళ్ళీ చెప్పిన కథలు



రావి కొండలరావు

## పాలు-నీళ్ళూ



ఓ ఊళ్ళో ఓ రాజుగారు. ఆయనకి పుట్టిన రోజు వచ్చింది. ఈ సంవత్సరం తన పుట్టిన్రోజుని ఎలా జరపాలా అని, గడ్డం గల పెద్ద మంత్రిని పిలిచి, తీవ్రంగా ఆలోచించాడు. అలా ఆలోచించి, యోచించి, చించి ఓ నిర్ణయానికి వచ్చారు రాజూ, మంత్రీ.

పుట్టిన రోజు మర్నాడనగా ఊరంతా చాటింపు వినిపించింది. "రేపు మన రాజుగారి జన్మదినోత్సవము. అయితే ప్రజలందరూ ఈసారి పళ్ళు పువ్వులో, నగలూ నాణాలో తెచ్చి రాజుగారిని సందర్శించనవసరంలేదు. తలా చెంబుడు పాలు తెచ్చి, కోటలో ఏర్పాటుచేయబడ్డ 'భూగంగాళం'లో పోస్తే చాలు. బీదా గొప్పా, మంచీ చెడ్డా, పెద్దరుగు, చిన్నరుగూ అన్న తేడాలు లేకుండా ప్రతి యిల్లు ఒక చెంబుడు పాలుతప్పకుండా తెచ్చి, "భూగంగాళం"లో పొయ్యాలి ఇది ఏలిన వారి ఆజ్ఞ."

ఈ సంవత్సరం రాజావారు కట్నాలూ కానుకలూ ఆశించకుండా చెంబుడు పాలు మాత్రమే తెమ్మన్నందుకు ఊరంతా సంతోషించింది. మర్నాడు వచ్చింది. అందరూ పాలే తీసుకు రావాలనడంలో పాలకి గిరాకీ హెచ్చింది. అదే సందని పాలవీధి అంతా పాల ధర పెంచేసింది. పాలవాళ్ళు ఆకాశం ఎత్తుకు ఎగిరిపోయి, ఎవరికీ అందకుండా నిచ్చెనలమీద కూచున్నారు. ఆ ధర ప్రజలకి ఏ మాత్రం అందుబాటులో కనిపించలేదు. ధర తగ్గించమన్న ప్రజల గోడు అంత ఎత్తులో వున్న పాలవాళ్ళకి వినిపించలేదు!

అంతలో ఒక శెట్టిగారికి ఒక ఉపాయం తట్టింది. "పాలధర ఆకాశాన్నంటింది; నా వల్ల కాదు. నేను చెంబుడు నీళ్ళు తీసుకెళ్ళి పోస్తాను. ఏం తెలుస్తుంది గనక? ఇంతమంది ప్రజలు పోసే పాలలో నా నీళ్ళు కలవకపోతాయా?" అనుకున్నాడు. తన ఆలోచనకి అరగంట మురిసిపోయాడు.

సూర్యుడు పైకి లేస్తున్న కొద్దీ శెట్టిగారికి వచ్చిన ఆలోచన లాంటిదే, తక్కిన వాళ్ళకి కూడా రావడం ఆరంభించింది. "నేనొక్కడిని నీళ్ళుపోస్తే, ఏం తెలుస్తుందిగనక?" అని ప్రతివాళ్ళూ చెంబుడేసి నీళ్ళు పట్టుకొని బయల్దేరారు - పైన మూతగా పళ్ళెమో, గుడ్డో, పలవో వేసి.

కోటలోకి వెళ్ళగానే సింహద్వారం పక్కగా భూగంగాళం వుంది. అది ఎవరికీ కనిపించదు. భూమి పైకి కనిపించే నలుచదరపు మూత తప్ప. లోపల ఏముందీ ఎవరికీ తెలీదు. ఆ ఏర్పాటు ప్రజలకి మరీ బాగా నచ్చింది. "పాలన్నీ మా ఎదురుగానే పొయ్యాలి" అన్న ఆజ్ఞ విధించకుండా అలాంటి చక్కని ఏర్పాటు చేసినందుకు ప్రజలు మరీమరీ సంతోషించారు. దాంతో "పోసే పాలు పోద్దాంలే" అనుకున్న వాళ్ళు కూడా "నీళ్ళే పోసేయొచ్చు. ఏం కొంప మునగదు" అన్న నిశ్చయాని కొచ్చేశారు. భూమట్టానికి సమానంగా వున్నమూత ఎత్తడం, నెమ్మదిగా చెంబు అందులోకి దించడం, పాలు-అదే నీళ్ళు, ఒంపేయడం! అంతే! అవి అలా ఎక్కడికో కిందికిపోతాయి. ప్రతి ఇంటికీ ఒక్కొక్కరు చొప్పున వరసలో వచ్చి నాలుగైదు గంటలకాలంలో రెండో కంటికి తెలియనివ్వకుండా చెంబులు దిమ్మరించి, ఏమీ ఎరగని వాళ్ళలా మొహాలు పెట్టి, చల్లగా మెల్లిగా జారుకున్నారు.

"ప్రజలంతా పాలుపోసేసినట్టేనా?" అని అడిగి, "అంతా పోసేసినట్టే" అన్న సమాధానం వచ్చినతర్వాత, రాజుగారూ మంత్రీ కలిసి 'భూగంగాళం' దగ్గరకొచ్చి మూతఎత్తించి, లోపలకి తలవంచిచూశారు. చూస్తే ఏముంది? పెద్ద గదంత వున్న ఆ భూ గంగాళంలో ఎక్కడా ఒక్క చుక్క పాలు లేవు! మొత్తం అంతా నీరే? రాజుగారు మంత్రి ముఖం చూశారు; మంత్రిగారు రాజు ముఖం చూశారు. ఇద్దరి ముఖాలూ తెల్లారేసరికి వికసించే తామర పువ్వుల్లా వికసించాయి. 'నా సలహా చూశారా, ఎలా పనిచేసిందో' అన్నట్టు చూశాడు—మంత్రి. 'గొప్ప ఆలోచన' అన్నట్టు అభినందన చూపు చూశాడు— రాజు. తమ పథకం (ఈ విధంగా నీరుగా) పారినందుకు ఎంతో సంబరపడిపోతూ, రాజుగారు ఆ మొత్తం నీటిని బళ్ళమీదికి ఎక్కించి, నీటికోసం అల్లాడిపోతున్న మద్రాసు ప్రజలకి పంపించి, హాయిగా నిట్టూర్చారు!

### భావ తత్త్వం

బంధాలు, బాధలు
అనురాగాలు, ఆవేశాలు
ఆశలు, ఆశయాలు
పెద్దవాళ్ళు, పేదవాళ్ళు
అనే రకరకాల
రంగుల తేడాలు
అణువణువునా వున్న
ఈ సమాజాన్ని చూస్తూ
బ్రతకడంకన్నా
అతీతమైన, ఆకస్మికమైన
మరణం నాకొస్తే
అదే పదివేలు!
ఈ జన్మకది చాలు!!

—'స్వప్న'